## క్లుప్తంగా

### పోలీసు స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ వీవీ రమణ

వెంకటగిరి రూరల్ : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పేకాట, కోడి పందేళ్లు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గూడూరు డీఎస్పీ వీవీ రమణ హెచ్చరించారు. ఆయన శుక్రవారం వెంకటగిరి పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. పెండింగ్ కేసుల రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ ఏవీ రమణ, ఎస్ఐలు పాల్గొన్నారు.

### డ్రోన్‌తో పురుగుమందు పిచికారీపై శిక్షణ



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కలువాయి: రైతులు పంటలకు డ్రోన్‌తో పురుగు మందులు పిచికారీ చేసుకోవడం వల్ల ఖర్చు తగ్గుతుందని మండల వ్యవసాయాధికారి వి.ప్రతాప్ తెలిపారు. ఆయన శుక్రవారం లలితానగర్‌లో రైతులు రామ్మోహన్, హజరత్తయ్య సాగు చేసిన వరి పైరుపై డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీవో శారదాంబ

దొరవారిసత్రం : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కిశోర బాలికలు అన్ని విధాలా ఆరోగ్యంగా ఉంటారని సూళ్లూరుపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో శారదాంబ, వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం కిశోర బాలికల వికాసంపై అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయం, వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ కిశోర బాలికల్లో రక్తహీనతను నివారించేందుకు పౌష్టికాహారం పెట్టాలన్నారు. బాల్య వివాహాలతో అనేక అనర్థాలు కలుగుతాయన్నారు. సైబర్ క్రైమ్ గురించి పోలీసులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోవర్ధన, సూపర్‌వైజర్ హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

### ఉద్యోగాల కల్పనకు ప్రత్యేక డ్రైవ్



విద్యార్థులతో కంపెనీ ప్రతినిధులు, కళాశాల చైర్మన్

గూడూరు రూరల్ : ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేసిన వెంటనే కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్టు ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ వంకి పెంచలయ్య తెలిపారు. కళాశాలలో శుక్రవారం కోడ్నెస్ట్ అనే సంస్థ 2025 బ్యాచ్ విద్యార్థుల కోసం ఇంటర్వ్యూలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రూప్ డిస్కర్షన్, టెక్నికల్ ఇంటర్వ్యూ నిర్వహించి 27 మందిని ఎంపిక చేశారు. వారికి చివరి విద్యాసంవత్సరం ప్రత్యేక శిక్షణ ఇచ్చి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కోడ్నెస్ట్ సీఈవో ప్రభాకర్, కళాశాల వైస్ చైర్ పర్సన్ వంకి అనూష, ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుమాధవ్, ప్లేస్‌మెంట్ అధికారి అర్చన, ఏవో రామయ్య పాల్గొన్నారు.

### 108లో సుఖ ప్రసవం



బిడ్డను కుటుంబ సభ్యులకు అందజేస్తున్న

తడ: మండలంలోని గ్రద్దగుంటకు చెందిన ఒక మహిళ 108లో మగ బిడ్డకు జన్మనిచ్చింది. గ్రామానికి చెందిన కె.రేఖకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఆటోలో తడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కాన్పు చేసేందుకు సౌకర్యాలు లేకపోవడంతో 108కు సమాచారం అందించారు. సూళ్లూరుపేట 108 సిబ్బంది ఈఎంటీ పెంచలయ్య, పైలెట్ కోటేశ్వరరావు ఆమెను సూళ్లూరుపేట ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. కాదలూరు వద్దకు వచ్చే సరికి నొప్పులు తీవ్రమయ్యాయి. దీంతో 108 సిబ్బంది అంబులెన్సులోనే కాన్పు చేశారు. రేఖ మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను ఆస్పత్రికి తరలించారు.

### రామానుజన్‌కు నివాళి

పెళ్లకూరు: మండలంలోని నెలబల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. రామానుజన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గణిత ఉపాధ్యాయుడు జీలుగ శ్రీరాములు విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. హెచ్ఎం కవిత, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, ఆదిలక్ష్మి, సరళ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# యాభై ఏళ్లుగా నిరీక్షణే

'మాది మంచి ప్రభుత్వం. ప్రజలకు మంచి చేయడమే మా ధ్యేయం' అని కూటమి నేతలు గొప్పలు చెప్పుకోవడం తప్ప ఎవరికీ న్యాయం చేయడం లేదు. 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమికి హక్కులు కల్పించాలన్న రైతుల కల కల్లగానే మిగిలిపోతోంది. ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు అందక రైతన్నలు పడుతున్న వేదన నాయకులు, ప్రభుత్వానికి పట్టడం లేదు. రైతుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లోనైనా తమ సమస్య గురించి పట్టించుకోవాలని సంబంధిత రైతులు కోరుతున్నారు.



కలిచేడు గ్రామంలోని భూములు

- పట్టాదారు పాసుపుస్తకాల కోసం ఎదురు చూపులు
- అందని ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు
- రెవెన్యూ సదస్సుల్లోనైనా సమస్య తీరేనా?

సైదాపురం : మండలంలోని కలిచేడు గ్రామంలో సుమారు 1800 ఎకరాల ఇనాం భూములు ఉన్నాయి. వెంకటగిరి రాజాలు పాలించే సమయంలో ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. వాటిలో కలిచేడుకు చెందిన సుమారు 250 మందికి పైగా రైతులు 50 ఏళ్ల నుంచి పంటలు సాగు చేసుకుంటున్నారు. రెవెన్యూ రికార్డుల్లో మాత్రం ఇప్పటికీ ఇనాం భూములుగానే ఉన్నాయి. అడంగల్‌లో మాత్రం సాగు చేసే రైతులను అనుభవదారులుగా నమోదు చేశారు. తమకు భూములపై హక్కు కల్పించాలని గ్రామస్తులు పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించుకున్నారు. అప్పటి జాయింట్ కలెక్టర్ చొరవ చూపి ఆ భూములను సమగ్రంగా సర్వే చేసి సాగు చేసుకుంటున్న వారందరికి పట్టాదారు పాసుపుస్తకాలను మంజూరు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఆయన బదిలీ కావడంతో కథ మళ్లీ మొదటికే చేరింది. ఏడాడి క్రితం సర్వే చేసి హక్కు పత్రాలు ఇస్తామని రెవెన్యూ అధికారులు చెప్పడంతో రైతుల్లో ప్రాణం వచ్చినట్టు అయింది. ప్రతి రైతూ కొంత మొత్తాన్ని వసూలు చేసి అధికారులకు ఇచ్చారు. హడావుడిగా సర్వే చేపట్టారు. సంబంధిత అధికారులు బదిలీపై వెళ్లిపోవడంతో మళ్లీ పెండింగ్ పండింది. పట్టాదారు పాసుపుస్తకాల మంజూరు చేయాలంటూ రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. పాసుపుస్తకాలు లేకపోవడంతో బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు. ప్రభుత్వ పథకాలు వర్తించడం లేదు. ప్రకృతి విపత్తులు సంభవించి పంటలు నష్టపోయినా పరిహారం అందడం లేదు. దీంతో రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు నగదు అప్పు తీసుకుని పంటలు సాగు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

**బ్యాంకుల్లో అప్పు ఇవ్వడం లేదు**



కలిచేడు గ్రామంలో ఉన్న భూములను 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం. వాటికి పాసు పుస్తకాలు లేకపోవడంతో ఏ బ్యాంకూ చిల్లిగవ్వ కూడా అప్పు ఇవ్వడం లేదు. రెవెన్యూ రికార్డుల్లో అనుభవదారులుగానే మిగిలిపోతున్నాం. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. - ఎం.భరత్ యాదవ్, కలిచేడు

**సమస్యను పరిష్కరించండి :**



కలిచేడు గ్రామంలో ఉన్న భూముల్లో అనేక ఏళ్లుగా పంటలు సాగు చేసుకుంటున్నాం. వాటిపై హక్కులు కల్పించి పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని కోరుతున్నా పట్టించుకున్న నాథుడు లేడు. గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులోనైనా మా సమస్యను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. - కేవీ రత్నయ్య, కలిచేడు

**పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వండి**



గ్రామంలో ఉన్న భూములకు పాసుపుస్తకాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. పంటలు సాగు చేసుకునేందుకు ఎవరూ రుణం ఇవ్వడం లేదు. అధిక వడ్డీలకు అప్పు తెచ్చుకుని పంటలు సాగు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లా అధికారులు స్పందించి వెంటనే పాసుపుస్తకాలను మంజూరు చేయాలి. - గుమ్మడి వీరాస్వామి యాదవ్, కలిచేడు

### రూ.55 లక్షలతో రోడ్లకు ప్రతిపాదనలు

కలువాయి: మండలంలో రెండో విడత కింద రూ.55 లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు పంచాయతీరాజ్ డీఈఈ ఏడుకొండలు తెలిపారు. ఆయన శుక్రవారం కలువాయి మండలంలో రోడ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో మండలంలో 38 సిమెంటు రోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. వాటిలో ఇప్పటికే 22 పూర్తయ్యాయని, మరో 16 రోడ్లను నిర్మించాల్సి ఉందన్నారు. వాటిని ఈ నెల 15 లోపు పూర్తి చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు.

### బాలికలు అప్రమత్తంగా ఉండాలి

చిల్లకూరు : ప్రస్తుతం ప్రేమ పేరిట దాడులు జరుగుతున్నాయని, బాలికలు అప్రమత్తంగా ఉండాలని గూడూరు ఒకటో పట్టణ ఏఎస్ఐ రూనీస్ తెలిపారు. గూడూరు పట్టణం మాళవ్యనగర్‌లోని బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం రెండో పట్టణ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బాలికల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ కొంతమంది ప్రేమ చూపిస్తున్నట్టు బాలికలపై ఎక్కడ పడితే అక్కడ చేతులు వేస్తుంటారని తెలిపారు. అలాగే మాయ మాటలు చెప్పి లోబరుచుకునే ప్రమాదం ఉందన్నారు. అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని వివరించారు.

### మోతాదు మించితే అనర్థం

సైదాపురం: మోతాదుకు మించి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడితే అనర్థాలు కలుగుతాయని నెల్లూరు డీఆర్సీ ఏవో గీతాకుమారి, శాస్త్రవేత్త కె.కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తుమ్మల తలుపూరులో శుక్రవారం రైతులకు శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ యూరియా అధికంగా వాడడం వల్ల తెగుళ్ల ఉధృతి పెరుగుతుందని పేర్కొన్నారు. పంటలు సాగు చేసిన ప్రతి రైతూ ఈక్రాప్ నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో హైమావతి పాల్గొన్నారు.

### ఆర్టీసీకే విద్యుత్ బస్సుల నిర్వహణ



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

గూడూరు రూరల్ : విద్యుత్ బస్సుల నిర్వహణను ఆర్టీసీకి అప్పగించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం 2029 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ బస్సులను ప్రవేశ పెట్టేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. తద్వారా డీజిల్‌తో నడిచే బస్సులను ఎత్తేయాలని చూస్తున్నారని ఆరోపించారు. తద్వారా ఆర్టీసీలో పనిచేసే సుమారు 15 వేల మంది కార్మికులు వీధిన పడతారని వెల్లడించారు. ఈ క్రమంలో విద్యుత్ బస్సుల నిర్వహణ బాధ్యతలను ఆర్టీసీకి అప్పగించి కార్మికులకు అండగా నిలవాలని కోరారు. అనంతరం విజయవాడలో జరిగే సెమినార్ కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్యదర్శి శేషయ్య, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు కెఎస్ వాసులు, రమేష్, రవీంద్ర, కృష్ణయ్య, ట్రేడ్ యూనియన్ నాయకులు జోగి శివకుమార్, శ్రీనివాసులు, బీవీ రమణయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### హామీలు అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

గూడూరు రూరల్ : ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం గూడూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ కార్మికులు సాధారణ మరణం చెందినా, ప్రమాదంలో మరణించినా పరిహారం చెల్లించాలన్నారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. జీవో 36ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయని పక్షంలో 10వ తేదీ నుంచి రిలే నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం కార్యదర్శి దారా కోటేశ్వరరావు, ఉప కార్యదర్శి సీహెచ్ రాజేష్, పెంచల ప్రసాద్, వెంకటరమణయ్య, జోగి శివకుమార్, పి.శ్రీనివాసులు, బీవీ రమణయ్య, సురేష్, అడపాల ప్రసాద్ పాల్గొన్నారు.

### భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

సైదాపురం: భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. కొమ్మిపాడులో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వో సుప్రజ, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

**ఓజిలిలో..**

ఓజిలి: మండలంలోని భువనగిరిపాళెంలో తహసీల్దార్ పద్మావతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వీఆర్వోలను ఆదేశించారు. ఆర్ఐ విజయ్‌కుమార్, సర్వేయర్ లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

**మా భూములు ఇచ్చేయండి**



బాలాయపల్లి: అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

నాయుడుపేట టౌన్ : బిరదవాడ రెవెన్యూ పరిధిలో 71 నంబరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సేకరించిన భూములకు పరిహారం చెల్లించాలని, లేనిపక్షంలో భూములు స్వాధీనం చేయాలని రైతులు కోరారు. బిరదవాడలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి హరోంహర తదితరులు పాల్గొన్నారు.

**డక్కిలిలో..**

డక్కిలి : మండలంలోని మార్లగుంట, యల్లావజ్జలపల్లిలో నిర్వహించిన సదస్సుల్లో 28 అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ ఎం శ్రీనివాసులు తెలిపారు. వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

# ఆదర్శమూర్తి సావిత్రి బాయి పూలే



కలువాయి: సత్కారం అందుకున్న టీచర్లు

కలువాయి: సావిత్రి బాయి పూలే నేటి మహిళలకు ఆదర్శమూర్తి అని కలువాయి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం అబ్బాస్ అలీ తెలిపారు. పాఠశాలలో శుక్రవారం సావిత్రిబాయి జయంతిని జరుపుకున్నారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కలువాయి సబ్ బ్రాంచ్ చైర్మన్ జి.పెంచలపుల్లయ్య 17 మంది మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. వైస్ చైర్మన్ రాంబాబు, కోశాధికారి మల్లికార్జున పాల్గొన్నారు.

**పెళ్లకూరులో..**

పెళ్లకూరు: సావిత్రిబాయి పూలే మహిళలకు స్ఫూర్తి ప్రదాత అని ఎంఈవో శంకరయ్య తెలిపారు. స్థానిక ఎమ్మార్సీలో సావిత్రిబాయి పూలే జయంతిని జరుపుకున్నారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సురేష్, అల్లెయ్య పాల్గొన్నారు.

**నాయుడుపేటలో..**

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పాత బస్టాండు వద్ద సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు సావిత్రిబాయి, జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జె.మస్తాన్, వినుకొండ శివ, ప్రతాప్ పాల్గొన్నారు.

**సూళ్లూరుపేటలో..**

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 21 పీపుల్స్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో సావిత్రి బాయిపూలే జయంతిని జరుపుకున్నారు. సంస్థ జిల్లా కన్వీనర్ అక్కరపాక చంద్రశేఖర్ సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మహిళా అధ్యాపకులను సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ శంకరశర్మ, ఐసీడీఎస్ అధికారి శారదాంబ తదితరులు పాల్గొన్నారు.

**బాలాయపల్లిలో..**

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి మండలం జయంపు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి జరుపుకున్నారు. ఉపాధ్యాయురాలు స్వర్ణలతను సత్కరించారు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ కయ్యుద్ తాజుద్దీన్, ఉపాధ్యాయులు దేవసేనమ్మ, అనూష, రేవతి, లక్ష్మి, ముత్యాలమ్మ, నాగరాజు, సందీప్ పాల్గొన్నారు.

### నేడు, రేపు హిస్టరీ కాంగ్రెస్ వార్షిక సమావేశాలు

చిల్లకూరు : ప్రాచీన ఆంధ్ర చరిత్రతో పాటు పురావస్తు పరిశోధనలకు చెందిన హిస్టరీ కాంగ్రెస్ వార్షిక సమావేశాలను శని, ఆదివారాల్లో ఎస్కేఆర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్టు చరిత్ర అధ్యాపకుడు డాక్టర్ గోవింద్ తెలిపారు. గూడూరు రెండవ పట్టణంలోని ఎస్‌కే ఆర్ కళాశాలలో శుక్రవారం వివిధ ప్రాంతాలకు చెందిన చరిత్ర పరిశోధకులు, అధ్యాపకులతో హిస్టరీ కాంగ్రెస్ వార్షికోత్సవం నిర్వహణపై సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత చరిత్ర ఆచార్యులు డాక్టర్ ఏఆర్ రామచంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశాల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన చరిత్ర పరిశోధకులు పాల్గొని వివరాలను తెలియజేస్తారని పేర్కొన్నారు.

### గూడూరును నెల్లూరులో కలపాలి

గూడూరు రూరల్ : తిరుపతి జిల్లాలో ఉన్న గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలని అఖిల పక్షం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని షాదీ మంజిల్‌లో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గూడూరును నెల్లూరులో కలపాలని ప్రజల కోరికన్నారు. ఇందుకోసం అధికారులు, నాయకులు చర్యలు చేపట్టాలన్నారు.

### ఘనంగా గోదాదేవి క్షేత్రోత్సవం

రాపూరు: మండలంలోని పెంచలకోనలో శుక్రవారం గోదాదేవికి ప్రత్యేక పూజలు, క్షేత్రోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని గోదాదేవికి నాలుగు శుక్రవారాలు ప్రత్యేక పూజలు, క్షేత్రోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా మూడో శుక్రవారం అమ్మవారి ఉత్సవ మూర్తిని తిరుచ్చిపై కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. మేళతాళాలు మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కోనమాఢ వీధుల్లో క్షేత్రోత్సవం చేపట్టారు.

### స్వామిత్వతో యాజమాన్య హక్కులు

చిల్లకూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వామిత్వ (సర్వే ఆఫ్ విలేజ్ అబాడి అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రొవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్) ద్వారా గ్రామాల్లోని గ్రామ నత్తం, ఇంటి స్థలం తదితరాలపై యాజమాన్య హక్కులు కల్పిస్తున్నట్టు డీఎల్‌పీ వెంకటరమణ తెలిపారు. గూడూరు ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం గూడూరు, చిల్లకూరు మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులకు స్వామిత్వపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆస్తులపై స్పష్టమైన యాజమాన్య హక్కులు కల్పించేందుకు స్వామిత్వ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. చిల్లకూరు ఈవోపీఆర్‌డీ సిరాజ్ స్వామిత్వ రికార్డుల నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గూడూరు ఎంపీడీవో మధుసూదన్, ఈవోపీఆర్‌డీ మోహన్ పాల్గొన్నారు.

# సొనకాలువ కట్టల ధ్వంసం

- సొనకాలువ బఫర్ జోన్లనూ వదలని కూటమి నేతలు
- పట్టించుకోని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు



సొన కాలువ కట్టలను చదును చేసిన వైనం

చిల్లకూరు : మండలానికి చెందిన కూటమి నేతలు సహజ వనరులను వదలడం లేదు. కొంతమంది సిలికా తరలింపునకు ప్రయత్నిస్తుండగా మరికొందరు సొనకాలువ బఫర్ జోన్‌లో ఉన్న భూమిని చదును చేసి వేరుశనగ పంట సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. చిల్లకూరు మండలం వేళ్లపాళెంలో సొనకాలువ ప్రవహిస్తుంది. దీని ప్రవాహం పెరిగి నీరు గ్రామాల మీదకు రాకుండా కట్టలు నిర్మించారు. ఆయా ప్రాంతాలను బఫర్ జోన్లుగా అధికారులు ప్రకటించారు. వేళ్లపాళెం గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు సొనకాలువ కరకట్టలను ధ్వంసం చేసి సుమారు నాలుగు ఎకరాల వరకు సాగుకు సిద్ధం చేస్తున్నాడు. సొనకాలువను ధ్వంసం చేయడం వల్ల దిగువ ప్రాంతంలోని భూములకు సాగు నీరు అందకుండా పోతుందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలుష్య నియంత్రణ మండలి, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు స్పందించి సిలికా గనుల నుంచి ప్రవహించే సొన కాలువను పరిరక్షించాలని కోరుతున్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానం



అవార్డులు అందుకున్న టీచర్లు

నాయుడుపేట టౌన్ : మండలంలోని ముగ్గురు టీచర్లు సావిత్రిబాయి పూలే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. స్థానిక ఎమ్మార్సీలో శుక్రవారం ఎంఈవోలు సావిత్రిబాయిపూలే జయంతిని జరుపుకున్నారు. ఆమె చిత్రపటానికి ఎంపీపీ ధనలక్ష్మి, మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, ఎంఈవో మునిరత్నం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల్లగా ఎ.యశోద(గొట్టిప్రోలు), కే సరస్వతి (బిరదవాడ), ఏ భువనేశ్వరి (తుమ్మూరు) ఎంపికయ్యారు. ఎల్ఏ సాగరం జెడ్పీ ఉన్నత పాఠశాల టీచర్ ఓరుగంటి బాలాజీ జిల్లా ఉత్తమ టీచర్‌గా అవార్డు అందుకున్నారు. ఎంపీడీఓ సురేష్‌బాబు, నాయకులు ఎస్ విజయభాస్కర్ రెడ్డి, సన్నారెడ్డి చంద్రా రెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సురేష్, పేర్నాటి రామకృష్ణ, సుబ్బారావు, అల్లెయ్య, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఏపీటీఎఫ్ కార్యాలయంలో విశ్రాంత ఉపాధ్యాయులు బందిలి మోహన్, సీ సారంగపాణి, ఉపాధ్యాయులు ఏ చంద్రశేఖర్‌కు ఏపీటీఎఫ్ సంఘ ఉద్యమ సేవా రత్న పురస్కారాలు అందజేశారు.

### పిల్లలపై శ్రద్ధ పెట్టాలి

వెంకటగిరి రూరల్ : పిల్లల పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని పాఠశాల తల్లిదండ్రుల కమిటీ శిక్షణా కేంద్రం తిరుపతి జిల్లా అధికారి సురేష్ తెలిపారు. పట్టణంలోని విశ్వోదయ జూనియర్ కళాశాలలో శుక్రవారం తల్లిదండ్రులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో పాఠ్యాంశాల బోధన, పాఠశాల స్థితిగతులపై దృష్టి సారించాలన్నారు. కోర్సు డైరెక్టర్ సి.బాబయ్య, రిసోర్స్‌పర్సన్ మారుతిప్రసాద్, నాగేంద్ర, ఆదినారాయణ పాల్గొన్నారు.

### కోడి పందెం రాయుళ్ల అరెస్టు

వాకాడు: ముగ్గురు కోడి పందెం రాయుళ్లను అరెస్టు చేసినట్టు ఎస్ఐ నాగబాబు శుక్రవారం తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు కోడివాకలో దాడి చేశామన్నారు. నిందితుల నుంచి రెండు కోళ్లు, రూ.1200 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

### ఆస్పత్రిని అభివృద్ధి చేయండి

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రిని 100 పడకలుగా అభివృద్ధి చేయాలని, మేనకూరులో ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాల ని బీజేపీ నేతలు కోరారు. వారు శుక్రవారం విజయవాడలో మంత్రి సత్యకుమార్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. బొల్లకాయల విజయ భాస్కర్, ఆకా చెంచుకృష్ణయ్య, అత్తలపాళెం మధురెడ్డి ఉన్నారు.

### కండలేరులో 57.052 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 57.052 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 700 క్యూసెక్కుల నీరు వస్తోందని, కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,030, లోలెవల్ కాలువకు 10, హైలెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామన్నారు.

### శివాలయంలో చోరీ

తడ: మండలంలోని తడకండ్రిగ పంచాయతీ బీఎల్‌పాడు గ్రామంలో ఉన్న భువనేశ్వరి సమేత భువనేశ్వరాలయంలోని హుండీని గురువారం రాత్రి దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ పూజారి చంద్రమౌళి ఫిర్యాదు మేరకు పోలీసులు ఆలయాన్ని పరిశీలించారు. దుండగులు ఆలయ ఆవరణలో ఉన్న హుండీని పగులగొట్టి అందులో ఉన్న నగదును చోరీ చేశారు. నూతన సంవత్సరం సందర్భంగా భక్తులు వేసిన కానుకలు సుమారు రూ.పది వేల వరకు ఉండవచ్చని స్థానికులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కొండపనాయుడు తెలిపారు.

### దుకాణాలు, హోటళ్లకు నోటీసులు

కోట: నిబంధనలు పాటించని దుకాణాలు, హోటళ్లకు ఫుడ్ సేఫ్టీ అధికారులు నోటీసులు జారీ చేశారు. వారు రెండు రోజుల పాటు కోట, విద్యానగర్‌లో తనిఖీలు చేశారు. ఈ క్రమంలో కోటలోని ఓ ప్రముఖ మార్ట్‌పై కేసు నమోదు చేశారు. విద్యానగర్‌లోని రెండు దాబాలు, రెండు మెస్‌లకు నోటీసులు జారీ చేసినట్లు అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. కొన్ని హోటళ్లలో కాలం చెల్లిన ఆహార పదార్థాలను విక్రయిస్తున్నారని, దాబాల్లో నిల్వ చేసిన మాంసం వాడుతున్నట్లు గుర్తించినట్టు పేర్కొన్నారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.